# 19

# మారుమనస్సు

మన ఆత్మసంబంధమైన విలువలను నిర్ణయించడానికి కొన్నిసార్లు మనమున్న పరిస్థితులను అంగీకరిస్తాం. ఇది ఎంతటి సత్యమో మరువరాని తీరులో లూకా 16లోని ధనవంతుడు, లాజరు అనే వారిని తెలియజేసిన దృశ్యమే ఉదాహరిస్తుంది. ధనవంతునికి తన జీవితంలో యితరులను గూర్చిన ఆలోచనగాని, ఆత్మ సంబంధమైన అవసరతలను గూర్చిన ఆలోచనలుగాని ఉన్నట్లు కన్పించవు. తన సొంత స్వార్థపరమైన కోర్కెలకు, ఆశలకు సంబంధించిన తన పరిమితి ప్రపంచాన్ని గూర్చియే అతడు అక్కర కలిగి యున్నట్లున్నాడు. మరణమైనప్పుడు, తాను జరిగించిన వాటి ఫలితాన్ని ఎదుర్కొనడానికి గాను అతడు నిత్యత్వానికి వెళ్లాడు. సుఖభోగముల జీవితంనుండి “పాతాళము” అని పిలువబడే ఆత్మసంబంధమైన లోకంలో బాధింపబడడానికి వెళ్లాడు (లూకా 16:23).

మరణానంతరం, అతని ప్రాధాన్యతలు సంపూర్ణంగా మార్చబడ్డాయి. తక్కిన ఆలోచనలన్నీ వెలవెలబోయాయి. రెండు గమనార్హమైన ఆలోచనలతో అతడు ఆక్రమించబడ్డాడు: మొదట, అతడు తన ఆత్మను గూర్చిన ఆలోచనలో మునిగిపోయాడు (ఒకవేళ అదే తొలిసారియై యుండవచ్చు). కనికరంకొరకు, కృపకొరకు అతడు వేడుకున్నాడు. అతని గూర్చి ప్రభువు యిట్లన్నారు, “తండ్రివైన అబ్రాహామా, నాయందు కనికరపడి, తన వ్రేలికొనను నీళ్లలోముంచి నా నాలుకను చల్లార్చుటకు లాజరును పంపుము; నేను ఈ అగ్ని జ్వాలలో యాతనపడుచున్నానని కేకలువేసి చెప్పెను” (లూకా 16:24).

రెండవది, తన సహోదరులయొక్క ఆత్మసంబంధమైన స్థితి విషయమైన అక్కరను అతడు తెలిపాడు. తన జీవితమంతటిలో తన సహోదరులయెడల తనకున్న ఆత్మసంబంధమైన ప్రేమను మాటల ద్వారా పలకడం యిదే తొలి సారియై యుండవచ్చు. కొద్దిక్షణాల యాతన అతనికి మిషినెరీ యొక్క హృదయాన్ని ప్రసాదించినట్లుంది. అతడు యిలా విన్నవించాడు,

> అప్పుడతడు – తండ్రీ, ఆలాగైతే నా కయిదుగురు సహోదరులున్నారు. వారును ఈ వేదనకరమైన స్థలమునకు రాకుండ వారికి సాక్ష్యమిచ్చుటకై నా తండ్రి యింటికి వాని పంపవలెనని నిన్ను వేడుకొనుచున్నాననెను (లూకా 16:27, 28).

అప్పటి కాలపు అందరివలెనే అతని సహోదరులు కూడ ధర్మశాస్త్రాన్ని, ప్రవక్తల రచనలను చదువవలసిందేనని అతడు తెలుపబడగా, "అతడు – తండ్రివైన అబ్రాహామా, ఆలాగు అనవద్దు; మృతులలోనుండి ఒకడు వారియొద్దకు వెళ్లిన యెడల వారు మారుమనస్సు పొందుదురని చెప్పెను" (లూకా 16:30). "మారుమనస్సు" అని అతని నోటనుండి పలికిన మొదటిసారి యిదేనా? అతనికున్న అభిలాషను ఆలోచనలను మరణం మార్చింది! అతని సహోదరులకు కావలసిందేమో అతడెరుగును – రూపాంతరం తెచ్చే మారుమనస్సు.

జీవితం యొక్క పెద్ద ప్రశ్న మారుమనస్సు అయ్యున్నట్టు కాలము, నిత్యత్వము మనలను ఒప్పిస్తాయి! ఈ గుర్తింపు మనలను బలంగా కొట్టేలా మరణంవరకు మనం వేచియుండకుండ ఉందుముగాక. ప్రభువైన యేసు యిలా అన్నారు, "మీరు మారుమనస్సు పొందనియెడల మీరందరును ఆలాగే నశింతురు" (లూకా 13:3, 5). ఏథెన్సు వారియెదుట పౌలు మారుమనస్సు యొక్క ఆజ్ఞకు ఎదురుగా నిలిచిన ప్రతి ఎదుర్కోలును నెట్టివేస్తూ యిలా ప్రకటించాడు: "ఆ అజ్ఞాన కాలములను దేవుడు చూచి చూడనట్టుగా ఉండెను; ఇప్పుడైతే అంతటను అందరును మారుమనస్సు పొందవలెనని మనుష్యులకు ఆజ్ఞాపించుచున్నాడు" (అపో. 17:30). దేవుని యెదుట నిలిచియున్న రెండింటిలో ఏదో యొక మార్గాన నరులు పయనిస్తారు: మారుమనస్సు మార్గము లేదా తిరుగుబాటు మార్గము. క్రీస్తు ప్రభువుయొక్క రాకడను దేవుడు తడవు చేయించేది ఒక్క కారణం కొరకే – మారుమనస్సుకు నడిపించడానికి ఎక్కువ సమయాన్ని ప్రసాదించడం కొరకే: "కొందరు ఆలస్యమని యెంచుకొనునట్లు ప్రభువు తన వాగ్దానమును గూర్చి ఆలస్యము చేయువాడు కాడుగాని యెవడును నశింపవలెనని యిచ్ఛయింపక, అందరు మారుమనస్సు పొందవలెనని కోరుచూ, మీ యెడల దీర్ఘశాంతము గలవాడై యున్నాడు" (2 పేతురు 3:9). ప్రతి మనిషియొక్క చివరి గమ్యం అతడు మారుమనస్సు పొందుతాడా లేదా అనేదాని మీద ఆధారపడియుంటుంది: "పిరికివారును, అవిశ్వాసులును, అసహ్యులును, నరహంతకులును, వ్యభిచారులును, మాంత్రికులును, విగ్రహారాధకులును, అబద్ధికులందరును అగ్ని గంధకములతో మండు గుండములో పాలుపొందుదురు; ఇది రెండవ మరణము" (ప్రకటన 21:8).

మారుమనస్సు కొరకైన క్రొత్త నిబంధన పిలుపునకు ప్రత్యుత్తరమిచ్చిన జనులతో

సంఘము నిర్మింపబడింది. క్రైస్తవులు ప్రభువు నామమును ఒప్పుకొనినవారై దుర్నీతినుండి తొలిగిపోయారు (2 తిమోతి 2:19). క్రీస్తులోనికి మార్పుచెందుట ద్వారా, అంధకార సంబంధమైన అధికారంనుండి విమోచింపబడినవారై, దేవుని కుమారుని రాజ్య నివాసులుగా వారు మార్పు చేయబడ్డారు (కొలస్సీ. 1:13). దేవునికి విధేయులైన పిల్లలుగా జీవించడానికి తమ్మును తాము అప్పగించుకొన్నవారై పూర్వపు వారి అజ్ఞాన దశలో వారికుండిన ఆశలను అనుసరించి ప్రవర్తింపక ఉండిపోతారు (1 పేతురు 1:14). తమ్మును పిలిచిన వానివలెనే జీవించడానికి వారు యిష్టపడతారు. తమ ప్రవర్తన అంతటిలో ఆయనను అనుకరించడానికి వారు ప్రయాసపడతారు. “నేను పరిశుద్ధుడనై యున్న ప్రకారము మీరును సమస్త ప్రవర్తనయందు పరిశుద్ధులైయుండుడి” అనే వారి యజమానుని కోర్కెననుసరించి, వారు తమ కార్యాలను జరిగిస్తారు (1 పేతురు 1:16).

గనుక, క్రైస్తవుడుగాను, క్రీస్తుసంఘ సభ్యుడుగాను ఉండ వెదకు ఎవనికైనను మారుమనస్సు అనేది మూలరాయి పదంగాను, ప్రధానమైన మనోభావంగాను ఉంటుంది. సంఘము యొక్క స్వభావము ప్రాథమిక భావంలోను ఆ పదమందు గుప్తమైన వాటిలోను ప్రతిబింబిస్తుంది. దేవుడు సంఘముగా తన ప్రజలను పిలిచేదానిలో మారుమనస్సు ఒక బిరుదుగా నిలుస్తుంది. సంఘము మారుమనస్సు కలిగిన వారితోనే కూడియుంది. కొర్నేలీ యింటిలోని అన్యజనుల బాప్తిస్మమును గూర్చి యెరూషలేములో యూదులలోనుండి క్రైస్తవులైన వారికి పేతురు వివరించినప్పుడు, యూదులలోనుండి వచ్చిన సహోదరులు, “... అన్యజనులకును దేవుడు జీవార్థమైన మారుమనస్సు దయచేసి యున్నాడని చెప్పుకొనుచు దేవుని మహిమపరచిరి” (అపొ. 11:18). నిజమైన జీవానికి ద్వారము నిజమైన మారుమనస్సుతో తెరువబడిందన్న సత్యము వారికి స్పష్టపరచబడింది, అది మనకు కూడా స్పష్టపరచబడింది.

మారుమనస్సు అంటే ఏమి? అదేమైయుందో, దాని భావమేమో అపార్థం చేయబడకుండునట్లు ఈ పదాన్ని స్పష్టంగా నిర్వచించుదాం. దీన్ని ఉదహరించడానికి సౌలుయొక్క మార్పును సూచనగా ఉపయోగించుకొందాం.

## పాపమునుండి మరలుట

మొదటిగా, మారుమనస్సు అనేది పాపమునుండి మరలుట, దుష్టత్వం విషయంలో వెళ్లు దిశను మార్చుకొనడం.

మారుమనస్సనేది వ్యక్తిగతమైన అభివృద్ధికంటె మిన్నయైనది, ఒకడు తన జీవితాన్ని

అదుపులో ఉంచుకొనడాన్ని మించినది. దేవునికి అన్యమైన ప్రతిదానిని విసర్జించడం అనే నిర్ణయం, అది అంతరంగపు లోతైన తీర్మానం. ఈ తీర్మానం క్రొత్త జన్మయని క్రీస్తు పిలిచినదానికి సంపూర్ణంగా తోడ్పడుతుంది (యోహాను 3:3).

**తాను పాపం చేసినట్టు ఒకడు కేవలం దుఃఖించడమే కాదు.** పాపము తనమీదికి తెచ్చిన కలతను బట్టి దుఃఖపడవచ్చు లేదా తన పాపమును బట్టి అతడు అపరాధమును చెల్లింపవలసి వచ్చినందున దుఃఖపడవచ్చు. ప్రభువైన యేసును అప్పగించినందుకు యూదా పశ్చాత్తాపపడ్డాడే గాని, మారుమనస్సు పొందినవాడు కాదు (మత్తయి 27:3). క్రీస్తును ఎరుగననిన పేతురైతే (మత్తయి 26:34, 69-75) మారుమనస్సు పొందాడు; యూదాయైతే కేవలం దుఃఖించాడు లేక పశ్చాత్తాపపడ్డాడు. తాను పాపం చేసినట్టు ఒకడు మనస్సులో నొచ్చుకొనవచ్చు గాని, ఎన్నడూ మారుమనస్సు పొందలేకపోవచ్చు.

**మారుమనస్సు అనేది కేవలం పాపము యొక్క ఒప్పింపు మాత్రమే కాదు.** పెంతెకొస్తు దినాన, తన మాటలు వింటున్న యూదుల యొక్క పాపాలను పేతురు ఎత్తి చూపాడు. అతని మాటలు వారి హృదయాలకు ఒప్పింపు కల్గించాయి, "మేమేమి చేతుము?" అని వారు బిగ్గరగా కేక వేశారు (అపొ. 2:37). అయినా, వారి ఒప్పుదలను పేతురు మారుమనస్సుగా గౌరవించలేదు లేక గుర్తించలేదు. ఎందుకంటే, వారు అడిగిన దానికి అతడు యిలా బదులిచ్చాడు, "మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు" (అపొ. 2:38).

**మారుమనస్సు అనేది కేవలము దైవ చిత్తానుసారమైన దుఃఖమే కాదు,** దైవ చిత్తానుసారమైన దుఃఖము ముందుగా వచ్చి, రక్షణార్థమైన మారుమనస్సును పుట్టించును. ఇందును గూర్చి పౌలు ఇలా అన్నాడు:

> దైవచిత్తానుసారమైన దుఃఖము రక్షణార్థమైన మారుమనస్సును కలుగజేయును;
> ఈ మారుమనస్సు పశ్చాత్తాపమును పుట్టించదు (2 కొరింథీ. 7:10).

మారుమనస్సు యొక్క విధానంలో దైవ చిత్తానుసారమైన దుఃఖము ఒక భాగమే కాని అదే మారుమనస్సు కాదు.

**మారుమనస్సును జీవితముయొక్క దిద్దుబాటు అని కూడా నిర్వచింప వీలుపడదు.** అయితే, అది జీవితపు దిద్దుబాటును కలిగిస్తుంది. మారుమనస్సు అనేది జీవితపు మార్పును కలిగించకపోతే, అది నిజమైన మారుమనస్సు కాదు. తనయొద్దకు వచ్చిన జనులను బాప్తిస్మమిచ్చు యోహాను యిలా అర్థించాడు. "మారుమనస్సుకు తగిన

ఫలములు ఫలించుడి” (మత్తయి 3:7బి). వాస్తవమైన మారుమనస్సు జీవితాన్ని మార్పు చేస్తుంది, మారుమనస్సుకు తగిన ఫలితాలను పుట్టిస్తుంది.

మారుమనస్సు పాపము విషయంలో చిత్తవృత్తియందు తీర్మానంతో కూడిన మార్పును తెస్తుంది. అందులో వివేచన, ఉద్వేగము, మనస్సాక్షి ఏకీభవించి పని చేస్తాయి. పాపం విషయంలో ఈ మనస్సుయొక్క మార్పు (ఎంత విస్తారమైనదంటే), మానవ వ్యక్తిత్వంలో ఒక జీవిత విధానాన్ని విసర్జించునంతగా ఒక వ్యక్తికి సామర్థ్యం కలిగిస్తుంది. (అంటే, పాప జీవితం విషయంలో ఒకని మృతునిగా చేస్తుంది) బాప్తిస్మమందు, పాపశరీరము నిరర్థకమగునట్లు, మన ప్రాచీన పురుషుడు సిలువ వేయబడి, పాపం విషయంలో ఆత్మసంబంధముగా మరణించునట్లు పాతిపెట్టబడితిమి (రోమా 6:6).

మారుమనస్సు యొక్క ఈ భావము సౌలుయొక్క మార్పులో గోచరిస్తుంది. తార్సువాడైన సౌలు పరిసయ్యుడు, హెబ్రీయుల సంతానమైన హెబ్రీయుడు (ఫిలిప్పీ. 3:5). మోషే ధర్మశాస్త్ర విషయములోనైతే, అనింద్యుడట (ఫిలిప్పీ. 3:6). ధర్మశాస్త్రాన్ని అనుసరించడంలో తప్పిపోయాడని న్యాయసంబంధమైన ఏ నేరము అతని మీద మోపబడదట. పరిసయ్యుడుగా – యూదా మతంలో ఉన్నత స్థాయి కలిగిన యూదుడుగా – యేసు వంచకుడనియు, ఆయన యూదా మతాన్ని చెరపడానికి ఉద్దేశం కలిగియున్నవాడని సౌలు నమ్మాడు. ఈ యేసును లయపరచే హింసయొక్క క్రూరత్వంతో ఎదిరించాలని సౌలు తలంచాడు. యేసును వెంబడించే ఎవడైనా తనకు శత్రువైయున్నట్టు అతడు నిస్సందేహంగా భావించాడు. తన శక్తి వంచనలేకుండగను, భయంకరమైన తీర్మానంతోను, క్రీస్తు సంఘాన్ని అంతరింపజేయాలని అతడు పూనుకున్నాడు.

సంఘాన్ని హింసించడంలో ఒక భాగంగా, ప్రధానయాజకుని యొక్క మద్దతు కొరకు అతడు అడిగాడు (అపొ. 9:1, 2). తాను కోరిన అధికారాన్ని అతడు పొందినప్పుడు, తన సంకల్పాన్ని నెరవేర్చుకొనడానికి గాను, అతడు దమస్కుకు బయలుదేరాడు. అతడు దమస్కును సమీపిస్తూ ఉండగా, మధ్యాహ్నపువేళ సూర్య తేజస్సును మించిన ప్రకాశంతో ప్రభువైన యేసు అతనికి ప్రత్యక్షమయ్యాడు. ప్రభువు ప్రసన్నతయొక్క వెలుగుచేత అంధుడుగా చేయబడినవాడై సౌలు నేలకు ఒరిగి పోయాడు. భూమి కంపించినంతటి ఒప్పింపుతో, తనతో మాట్లాడుతున్నవాడు దేవుని కుమారుడైన యేసుక్రీస్తు అనే సత్యంతో అతడు ఒప్పింపబడినవాడై, తీవ్రమైన పశ్చాత్తాపంతోను, నలిగివిరిగిన హృదయంతోను,“ప్రభువా, నేనేమిచేయవలెను?” అని అతడు అడిగాడు (అపొ. 22:10). తాను ఏమి చేయవలసింది తెలుపబడేలా, అతడు దమస్కుకు వెళ్లవలసిందిగా ప్రభువు ఆదేశించాడు (అపొ. 9:6). అతడు అక్కడికి చేరుకొన్నప్పుడు,

జవాబు అననీయ ద్వారా అతనికి తేబడేవరకు, మూడు దినాలు అతడు వేచియుండి ప్రార్థన ఉపవాసంతో కాలం గడిపాడు.

సౌలు మారుమనస్సు పొందాడు. తన జీవిత విధానాన్ని గూర్చి, తన చిత్తాన్ని అతడు తీర్మానంతో మార్చుకున్నాడు. యూదా మతానికి సమర్పించిన తన జీవితంతో క్రీస్తు సంఘాన్ని హింసించిన సౌలు; దమస్కు మార్గంలో మారుమనస్సు పొందినప్పుడు, అతని జీవితం పూర్ణంగా క్రొత్త దిశకు మళ్లింది. వివేకము, ఉద్వేగము, మనస్సాక్షితో కూడిన – అతని సంపూర్ణ వ్యక్తిత్వము పాత జీవిత విధానంనుండి మరలేలా, విప్లవకరమైన తీర్మానాన్ని తన చిత్తమందు అతడు చేశాడు. తరువాత, అతడిలా అన్నాడు, "అయినను ఏవేవి నాకు లాభకరములైయుండెనో వాటిని క్రీస్తునిమిత్తము నష్టముగా ఎంచుకొంటిని" (ఫిలిప్పీ. 3:7).

సౌలువలె క్రైస్తవులు మారుమనస్సునందు పాపమునుండి మరలిన జనులై యున్నారు. ప్రతి విధమైన కీడుకు దూరంగా ఉండడమే దేవుని ప్రజలయొక్క జీవిత విధానమైయుంది (1 థెస్స. 5:22). వారు ఈ లోక మర్యాదను అనుసరింపక (రోమా 12:2), కీడును మేలుచేత జయించుచు (రోమా 12:21), తమ సత్ ప్రవర్తనవలన తమపై మోపబడే తప్పుడు నేరాలను అణచివేస్తూ (1 పేతురు 2:12) సాగిపోతారు.

## పాపమునుండి క్రీస్తు వైపునకు మరలుట

రెండవది, మారుమనస్సు అనునది క్రీస్తు వైపుకు మరలుటయైయుంది. అది కీడుకు వ్యతిరేకంగా తిరగడం మాత్రమే కాదు; అది క్రీస్తుకు సాధకమైన విధేయత కూడా అయ్యుంది.

వారు "విగ్రహములను విడిచిపెట్టి" "జీవము గలవాడను సత్యవంతుడునైన దేవుని" వైపునకు తిరిగిరని పౌలు థెస్సలొనీకయులను మెచ్చుకున్నాడు (1 థెస్స. 1:9). ఒకడు పాపమునుండి మరలి దేవుని వైపునకు తిరుగకుండినట్లయితే, క్రొత్త నిబంధనలో ఈ పదముయొక్క సంపూర్ణ భావమును బట్టి అతడు మారుమనస్సు పొందియుండడు.

క్రొత్త నిబంధన యొక్క సువార్త ప్రకటన యొక్క ప్రధాన వక్కాణింపంతా క్రీస్తును ఘనపరచడమే. సమరయలో ఫిలిప్పు ప్రకటించిన మాదిరియే, దైవప్రేరేపితులైన మనుష్యులు చేసినట్టు లూకా యొక్క వర్ణన ఉదాహరణగా ఉంది: "అప్పుడు ఫిలిప్పు సమరయ పట్టణమువరకు వెళ్లి క్రీస్తును వారికి ప్రకటించుచుండెను" (అపొ. 8:5).

ఈలాటి సువార్త ప్రకటనకు జనులు బదులిచ్చినప్పుడు, వారు సువార్త సందేశానికి లోబడుతూ, పాపమును విసర్జించి, క్రీస్తును స్వీకరించారు. పౌలు ఎఫెసులో ప్రసంగించిన మీదట, మారుమనస్సు యొక్క యిరు వైపులు వివరించబడ్డాయి. లూకా యిలా అన్నాడు,

> ... వారికందరికి భయము కలిగెను గనుక ప్రభువైన యేసు నామము ఘనపరచ బడెను. విశ్వసించినవారు అనేకులు వచ్చి, తాము చేసినవాటిని తెలియజేసి యొప్పుకొనిరి. మరియు మాంత్రిక విద్య అభ్యసించినవారు అనేకులు తమ పుస్తకములు తెచ్చి, అందరియెదుట వాటిని కాల్చివేసిరి (అపొ. 19:17బి-19ఎ).

మారుమనస్సు పొందిన ఎఫెసీయులు క్రీస్తును అంగీకరించి, పాపభరితమైన వారి ఆచార వ్యవహారాలను విసర్జించారు.

సౌలుయొక్క మారుమనస్సు పాపమునుండి మరలి క్రీస్తువైపునకు తిరుగుటయై యుంది. తాను దమస్కువైపు పయనించుతూ, క్రైస్తవులను హింసించే మార్గంలో సౌలు ఉన్నాడు. మోషే ధర్మశాస్త్రం క్రింద జీవించుతూ, నైతికమైన కర్మకాండకు సంబంధమైన నేరాలకు అతడు దూరుడైయున్నాడు. ఏ భావాన్నిబట్టి ఆలోచించినా, అతడు దుష్టుడై తప్పిపోయినవాడు కాదు. దేవుని ఆనందింపజేయాలనే ఉన్నతమైన అతని కోర్కెను అతని మారుమనస్సు తాకలేదు. తన యౌవన కాలంనుండి అతడు ఆ వాంఛతోనే నడిపింపబడ్డాడు, అందులో ధర్మశాస్త్రాన్ని తూచా తప్పకుండ పాటించడంలో దాన్ని ప్రత్యక్షపరచాడు. ఏదియెలాగున్నా, అతడు క్రైస్తవులను హింసించడము ఘోరమైన పాపమే. తత్ ఫలితంగా, దేవుని సేవించడమంటే, క్రీస్తును దూషించడం, క్రైస్తవులను హింసించడమనే తన గత జీవితాన్ని దేవునియెదుట అతనికి కలిగిన మారుమనస్సునుబట్టి వదలుకోవలసియుంటుంది. అంతేగాకుండ, క్రీస్తువైపునకు మరలి, ఆయనను ప్రభువుగా స్వీకరించి, ఆయన చిత్తానికి అణకువగా లోబడవలసియుంది.

ఫిలిప్పీ. 3:8-11 పౌలు తన మారుమనస్సును తానే వర్ణించుకున్నాడు:

> ... నిశ్చయముగా నా ప్రభువైన యేసుక్రీస్తునుగూర్చిన అతి శ్రేష్ఠమైన జ్ఞానము నిమిత్తమై సమస్తమును నష్టముగా ఎంచుకొనుచున్నాను. క్రీస్తును సంపాదించుకొని, ధర్మశాస్త్రమూలమైన నా నీతినిగాక, క్రీస్తునందలి విశ్వాసమువలననైన నీతి అనగా విశ్వాసమునుబట్టి దేవుడు అనుగ్రహించు నీతిగలవాడనై ఆయనయందు అగపడు నిమిత్తమును, ఏ విధముచేతనైనను మృతులలోనుండి నాకు పునరుత్థానము కలుగవలెనని, ఆయన మరణవిషయములో సమానానుభవముగలవాడనై, ఆయనను ఆయన పునరుత్థానబలమును ఎరుగు నిమిత్తమును, ఆయన శ్రమలలో పాలివాడనగుట యెట్టిదో యెరుగు నిమిత్తమును, సమస్తమును నష్టపరచుకొని

వాటిని పెంటతో సమానముగా ఎంచుకొనుచున్నాను.

గనుక, సౌలు పాపమునుండి మరలి క్రీస్తువైపునకు తిరిగాడు. మారుమనస్సు అంటే అతనికి–అటు నిరాకరణను తెలిపేది, యిటు అంగీకారాన్ని తెలిపేదైయుంది. అది గత జీవిత విధానంనుండి తిరిగేది, క్రీస్తునందున్న శ్రేష్ఠమైన నూతన మార్గానికి తిరిగేదై యుంది.

మారుమనస్సు పొందిన జనులతో కూడిన, క్రీస్తు శరీరమైన సంఘం, క్రీస్తుకు విధేయతగా జీవిస్తుంది. దానిలోని సభ్యులు క్రీస్తుతో ఏక దేహమైయున్నారు. మారుమనస్సు ద్వారా, క్రైస్తవుడు పరిశుద్ధత, నీతి అనే జీవిత విధానంలో ప్రవేశించాడు. అతడు క్రీస్తుతోకూడ సిలువ వేయబడినవాడై, మారుమనస్సు మూలంగా ప్రతిఫలించిన నూతన జీవాన్ని ఆధారం చేసికొని, దేవుని కుమారునియందలి విశ్వాసం ద్వారా అతడు జీవిస్తాడు (గలతీ. 2:20). మారుమనస్సు పొందిన దేవుని ప్రజలుగా, క్రైస్తవులు క్రీస్తు నామాన్ని ధరించుకుంటారు. క్రీస్తునందు ఏకమై జీవిస్తారు. ఆరాధనలో క్రీస్తు ప్రభువును ఘనపరచుతారు. మరియు తమ మరణమందు గాని లేక ఆయన రాకడయందు గాని ఆయనతో సంపూర్ణంగా ఉంటామనే ఎదురు చూపుతో నీతిగా ఉండడానికి వారు ప్రేమచేత బలవంతపెట్టబడతారు.

## పాపంనుండి క్రీస్తువైపుకు జీవితాంతంవరకు మరలుట

మూడవది, మారుమనస్సు అనేది పాపంనుండి క్రీస్తువైపుకు జీవితాంతమువరకు తిరుగుటయైయుంది. దుష్టునినుండి కొద్దికాలపు విశ్రాంతి లేక విరామానికి, మత సంబంధమైన సెలవునకు క్రీస్తు ప్రభువు ఎవనినీ ఆహ్వానించలేదు. సంపూర్ణ సమర్పణకు ఆయన పిలిచాడు, దానిని ఆయన నీటిమూలముగాను ఆత్మమూలముగాను కలుగు జన్మ లేక పైనుండి కలుగు జన్మ అని సూచించాడు (యోహాను 3:5). అది ఎంతటి వింతైన స్థిరంగా ఉండే రూపాంతరమంటే – పౌలు దానిని, దేవుని కార్యంవలన శరీరేచ్ఛలతో కూడిన స్వభావాన్ని విసర్జించడమనే ఆత్మసంబంధమైన సున్నతికి పోల్చాడు:

> మీరును, క్రీస్తు సున్నతియందు, శరీరేచ్ఛలతో కూడిన స్వభావమును విసర్జించి ఆయనయందు చేతులతో చేయబడని సున్నతి పొందితిరి (కొలస్సీ. 2:11).

ప్రాచీన పురుషుని విసర్జించి నవీన పురుషుని ధరించుకొనడమే మార్పు అనే దానికి భావమని పౌలు అన్నాడు. అంటే, చూడనసహ్యమైన, మురికి, చినిగిపోయిన

వస్త్రములను వాటిని మరెన్నడు తొడుగుకొనమనే ఉద్దేశంతో తీసివేయడంవంటిదై యిది వుంది (ఎఫెసీ. 4:24; కొలస్సీ. 3:10). మనం క్రీస్తు రక్తముచే విమోచింప బడినప్పుడు, పాప మరణములనుండి దేవుడు మనలను లేవనెత్తి, క్రీస్తునందున్న జీవాన్ని ఆయన మనకు ప్రసాదిస్తాడు (కొలస్సీ. 2:13).

మారుమనస్సు అనేది ముందుకు సాగిపోయే సమర్పణతో కూడినదై యుంటుంది. దేవునికి మనం యిచ్చే ప్రత్యుత్తరంలో, శరీరేచ్ఛలను చంపవలసినవారమై యుంటాం. అప్పటినుండి, క్రైస్తవులుగా మన యెదుట ఉండే ఒకే ఒక కార్యమేమంటే, ఆ శరీరేచ్ఛలు తిరిగి పైకి రాకుండా చూచుకోవాలి. "కావున భూమిమీదనున్న మీ అవయవములను, అనగా జారత్వమును, అపవిత్రతను, కామాతురతను, దురాశను, విగ్రహారాధనయైన ధనాపేక్షను చంపివేయుడి" అని పౌలు అన్నాడు (కొలస్సీ. 3:5). ఇంకా అతడిలా అన్నాడు.

> ఇప్పుడైతే మీరు, కోపము, ఆగ్రహము, దుష్టత్వము, దూషణ, మీనోట బూతులు అను వీటన్నిటిని విసర్జించుడి. ఒకనితో ఒకడు అబద్ధమాడకుడి; ఏలయనగా ప్రాచీన స్వభావమును దాని క్రియలతో కూడ మీరు పరిత్యజించితిరి (కొలస్సీ. 3:8, 9).

కాలములో ఒకానొక సమయమందు వాటిని విసర్జించుమన్నాడు, మరణమనే బిందువు దగ్గర, (శరీరేచ్ఛలను చంపినప్పుడు), అలా వాటిని విసర్జించుతునే ఉండుడని పౌలు వ్రాసి, కొనసాగవలసిన విధానంగా కూడా మారుమనస్సును అతడు సూచించాడు.

వీటన్నిటికి వివరమైన లేక స్పష్టమైన ఉదాహరణలతో కూడిన పౌలుయొక్క మార్పు వద్దకు కాకుండ మారుమనస్సుయొక్క భావానికి వేరెక్కడకు మనం తిరుగుతాం? ఒకతను యిలా అన్నాడు, "తనవైపుకు సంపూర్ణంగా తిరిగిన ఒక మనిషితో దేవుడు ఏమి చేయగలడో మనం యింకా చూడలేదు." మనం చూడనట్టయితే, దానికి బహు సమీపంగా సౌలు యొక్క జీవితంలో వచ్చి చేరుకున్నాం (అంటే, తనవైపుకు పరిపూర్ణంగా తిరిగిన మనిషితో దేవుడు ఏమి చేయగలడో సమీపించి సౌలునందు మనం చూడగలమని దాని భావం). సౌలు జీవితపు మార్పుయొక్క ఫలితం లోకంమీద రెండువేల సంవత్సరాలు తన ప్రభావాన్ని కనుపరచింది. క్రీస్తును వెంబడించాలనే అతని తీర్మానం చివరిది, మార్పులేనిదై యుంది. దానితో క్రీస్తు ఏమి మేలు చేయగలడోనంటు, సేవకొరకై అతడు తన జీవితాన్ని ఆయన సిలువయొక్క అడుగు భాగాన ఉంచాడు.

గొప్ప యుద్ధంకొరకు మహా అలెగ్జాండరు తన సైన్యాన్ని ఒడ్డునకు తెచ్చిన తరువాత ఓడలు ఖాళీ చేయబడిన వెంటనే వాటిని తగలబెట్టమని ఆజ్ఞాపించాడట. తిరిగి వెనుకకు

వెళ్లే అవకాశాన్ని గూర్చి అలెగ్జాండరు ఆలోచన చేయలేదు. తనకుగాని, తన సైన్యానికి గాని వెనుకకు తిరిగే ఆలోచన లేదు. వారికున్న భవిష్యత్తు ఏదైనా ఉంటే, అది వారిముందే ఉందిగాని, వారి వెనుక లేదు. సౌలుకు కూడా అంతే. ఏ విధమైన మినహాయింపులకు గాని, తిరిగివెళ్లే అవకాశానికిగాని తన హృదయంలో అతడు తావు యియ్యలేదు.

సంఘమైయున్న దేవుని ప్రజలు, సమర్పణ చేసికొన్నారు – దాన్ని రూపాంతర మని, మరణములోనుండి జీవములోనికి దాటడమని గుర్తింపవచ్చు (1 యోహాను 3:14). జీవంకొరకు క్రీస్తునందు వారు నూతన పురుషుని ధరించుకొని యున్నారు. వారు క్రీస్తులోనికి మార్పుచెందిన ఆ సమయంలో అది సంభవించింది కాని, హృదయ శుద్ధీకరణ అనేది ఎల్లప్పుడు జరిగించుకొనవలసిన బాధ్యత వారిమీద ఉంది (రోమా 6:2బి). ప్రాచీన పురుషుడు చంపబడ్డాడు, కాని తన పునరుత్థానానికి ఏదైనా అవకాశం లభించినట్లయితే, వాడు తిరిగి బ్రతకడానికి ప్రయత్నిస్తాడు (రోమా 6:12, 13). గనుక క్రైస్తవుడు అజ్ఞానివలె కాక, జ్ఞానివలె నడుచుకొనడానికి జాగ్రత్తపడాలి (ఎఫెసీ. 5:17). నిష్ఫలమైన అంధకార క్రియలలో అతడు పాలివాడై యుండక వాటిని ఖండించాలి (ఎఫెసీ. 5:11). అతడు మృతిపొందాడు, అతని జీవము క్రీస్తుతో కూడ దేవునియందు దాచబడియుంది (కొలస్సీ. 3:3). మృతులలోనుండి సజీవుడైయున్నట్టు క్రైస్తవుడు భావించి, తన్ను తాను దేవునికి అప్పగించుకొని, తన అవయవములను నీతికి సాధనములుగా అప్పగించుకోవాలి (రోమా 6:13).

## ముగింపు

దేవుని యెదుట లెక్క అప్పగించవలసిన ప్రతివాడును మారుమనస్సుపొంది, మారుమనస్సుకు తగిన జీవితాన్ని జీవింప బద్ధుడైయుంటాడు. మారుమనస్సు అనేదే, సంపూర్ణ చిత్తముయొక్క మార్పు, పాపమునుండి క్రీస్తునొద్దకు జీవము కొరకు తిరుగుటయైయుంది. పాపము యొక్క ఒప్పింపువలనను, దైవచిత్తానుసారమైన దుఃఖము వలనను, దేవునియొక్క మంచితనంవలనను అది కలుగుతుంది. అది ఒక వ్యక్తిని నూతన జీవానికి తెచ్చి రూపాంతరమందు అది ప్రతిఫలిస్తుంది. అతని జీవము క్రీస్తుతో కూడ దేవునియందు దాచబడుతుంది.

సంఘమనేది నూతన పురుషులు (లేక) వ్యక్తుల సమాజమైయుంది. వారు పరిపూర్ణులు కారు, కాని పవిత్రత, భక్తి, నీతిని వెంటాడేవారైయున్నారు. ప్రభువు యొక్క సేవలో ఘనత కొరకైన పాత్రలుగా తమ యావజ్జీవాన్ని సమర్పించినవారైయున్నారు.

మారుమనస్సు కొరకైన మూడు ప్రేరేపణలు లేఖనాల్లో తేలికగా కనుగొనవచ్చు. మొదటిది, దేవుని అనుగ్రహము మారుమనస్సు పొందునట్లు ప్రేరేపిస్తుందని పౌలు అంటాడు: "దేవుని అనుగ్రహము మారుమనస్సు పొందుటకు నిన్ను ప్రేరేపించుచున్నదని యెరుగక, ఆయన అనుగ్రహైశ్వర్యమును సహనమును దీర్ఘశాంతమును తృణీకరించెదవా?" (రోమా 2:4). రెండవది, బహుమానాన్ని గూర్చిన వాగ్దానాన్ని పేతురు ప్రస్తావించి యిలా అన్నాడు: "ప్రభువు సముఖమునుండి విశ్రాంతికాలములు వచ్చునట్లును... మీ పాపములు తుడిచి వేయబడు నిమిత్తమును మారుమనస్సు నొంది తిరుగుడి" (అపొ. 3:19, 20). మూడవది, శిక్షను గూర్చిన భయాన్ని యోహాను సూచించాడు:

> ఆ దినములయందు బాప్తిస్మమిచ్చు యోహాను వచ్చి - పరలోకరాజ్యము సమీపించియున్నది, మారుమనస్సు పొందుడని యూదయ అరణ్యములో ప్రకటించుచుండెను. ...ఇప్పుడే గొడ్డలి చెట్లవేరున ఉంచబడియున్నది గనుక మంచి ఫలము ఫలింపని ప్రతి చెట్టును నరకబడి అగ్నిలో వేయబడును (మత్తయి 3:1-10).

దేవుని ఆనందింపజేయడానికి కేవలం మారుమనస్సే చాలదు, కాని మారుమనస్సు మనలో విధేయతగల స్వభావాన్ని పుట్టిస్తుంది. క్రీస్తులోనికి వచ్చేలా దేవుడు కావలెనని ఆజ్ఞాపించిన ఆజ్ఞలన్నిటికి విధేయులమగునట్లు అది బలవంతపెడుతుంది. ఒకని జీవితాన్ని దేవుని చిత్తానికి అది తెరుస్తుంది.

మన ప్రభువుయొక్క కడపటి మాట ఘనత్వముగల ఉత్తరువు (Great Commission) కాదు, కాని ఆసియాలోని ఏడింటిలో అయిదు సంఘాలను మారుమనస్సుకు పిలవడం అని చెప్పబడింది (ప్రకటన 1-3). నీవు మారుమనస్సు పొంది క్రీస్తు శరీరంలోనికి వచ్చి మారుమనస్సు పొందిన దేవుని ప్రజలతో నీవు జీవించుచూ ఉండక పోయినట్లయితే, ఇంతకంటే గొప్ప అవసరత నీకు ఏదీలేదు సుమీ. నీవు క్రీస్తునందు నూతన పురుషునిగా జీవిస్తున్న క్రైస్తవుడవైయుంటే, నీ అత్యున్నతమైన బాధ్యత నీ సమర్పణకు తగినట్టుగా జీవించడమే.

## పరిశీలనకైన ప్రశ్నలు

(*జవాబులు - 260వ పేజీలో*)

1. మరణము ధనవంతునియొక్క ఆలోచనను ఎలా మార్చింది?
2. క్రైస్తవుడైయుండగోరిన ఎవనికైనా మారుమనస్సు అనేది మూలరాయి పదంగాను - ప్రధానమైన మనోభావంగాను ఎందుకు ఉంటుంది?
3. పాపం చేశానని ఒకడు బాధ, పశ్చాత్తాపము కంటె మారుమనస్సు ఎందుకు హెచ్చయినది?
4. మారుమనస్సు కేవలం దైవచిత్తానుసారమైన దుఃఖము ఎందుకు కాదో వివరించుము?
5. సౌలుయొక్క మార్పులో మారుమనస్సు ఏ విధంగా చూడబడుతుంది?
6. పౌలు థెస్సలొనీకయులను ఎందుకు మెచ్చుకున్నాడు?
7. మారుమనస్సు అనేది పాపాలను ఒప్పుకునే దానికంటె ఎలా మిన్నైనది?
8. మారుమనస్సుకు ప్రేరేపించే మూడు లేఖన భాగాలేవి?

## రాబోవు బైబిల్ స్టడీకి గైడు

**ఎవరు మారుమనస్సు పొందాలి? -** 2 పేతురు 3:9; అపొ. 17:30, 31; లూకా 13:3.

**మారుమనస్సుకు క్రొత్త నిబంధన ఉదాహరణలు -** తప్పిపోయిన కుమారుడు (లూకా 15:11-24); జక్కయ్య (లూకా 19:2-8).

**మారుమనస్సు యొక్క వెల -** మత్తయి 10:34-39; లూకా 12:51-53.

**మారిన వారి ఉదాహరణలు -** అపొ. 2:36-47; 8:5, 6, 12, 18-22, 26-39; 9:1-18; 10:1-48; 16:13-15, 25-34; 19:1-5.

**క్రైస్తవ ప్రభావము -** మత్తయి 5:13-16; 1 కొరింథీ. 15:33.

**ప్రజలందరి కొరకు ప్రభువైన యేసు తన రక్తాన్ని కార్చాడు -** విధేయులైన వారికి రక్షణ అనుగ్రహింపబడింది (హెబ్రీ. 9:11-14); ఎడ్లయొక్కయు మేకల యొక్కయు రక్తము పాపములను తీసివేయజాలినవి కావు (హెబ్రీ. 10:4); ఆయన రక్తమే మనలను విమోచించింది (1 పేతురు 1:18, 19); ప్రతివానికొరకు ప్రభువు మరణాన్ని రుచి చూచాడు (హెబ్రీ. 2:9).

**సిలువవైపు చూచినప్పుడు మనం నేర్చుకొనేదేమంటే –** మనకు రక్షకుడు అవసరమని (రోమా 3:23; 5:12); దేవుడు మనలను ఎంతగా ప్రేమించాడని (యోహాను 3:16); వారు పాపులైయున్నా, క్రీస్తు జనులను ప్రేమిస్తున్నాడని (రోమా 5:8, 9); రక్షణ అనేది దేవుని వరమేనని (ఎఫెసీ. 2:8–10).

**బాప్తిస్మము ద్వారా మనం ఆయన రక్తాన్ని సంధించినప్పుడు, సిలువపై యేసు ప్రభువు అనుభవించిన మరణం మనలను రక్షిస్తుంది –** బాప్తిస్మమందు మనం ఆయనతో కూడ పాతిపెట్టబడ్డాం (రోమా 6:3, 4); బాప్తిస్మము రక్షించును (1 పేతురు 3:21).

## సువార్తకు విధేయులైన తరువాత క్రైస్తవులుగా మనం ఎలా జీవించాలి?

1. *ఆత్మసంబంధమైన ఎదుగుదలకు సమర్పణ కలిగియుండు.* ఎదగడానికి అన్ని విధాలా ప్రయత్నించు (2 పేతురు 1:1–10). ఎదగడానికి ఏర్పాటు చేసికో (ఫిలిప్పీ. 3:7–15).
2. *బైబిలును పఠించు* – సత్యవాక్యాన్ని సరిగా విభజించు (2 తిమోతి 2:15). జ్ఞానమందు ఎదుగు (2 పేతురు 3:18); అనుదినం లేఖనాలను చదువు (అపొ. 17:11). వినయముతో దేవుని వాక్యాన్ని స్వీకరించు, దానికి లోబడు (యాకోబు 1:21–25).
3. *క్రైస్తవ సుగుణాలు నీ జీవితానికి చేర్చుకో* – విశ్వాసమునందు సద్గుణము, జ్ఞానము, ఆశానిగ్రహము, సహనము, భక్తి, సహోదర ప్రేమ, దయ కలిగి యుండు (2 పేతురు 1:5–7).
4. *క్రమముగా ప్రార్థించు.* జ్ఞానంకొరకు ప్రార్థించు (యాకోబు 1:5, 6). ఎడతెగక ప్రార్థన చేయి (1 థెస్స. 5:17).
5. *(సాధ్యమైతే యితర క్రైస్తవులతో కలిసి) ఆరాధించు.* సమాజంగా కూడడం మానవద్దు (హెబ్రీ. 10:25). మీ ప్రాంతంలో స్థానిక సంఘం లేనట్టయితే, నీవు నీ యింటనే ఒక దానిని ప్రారంభింపవచ్చు (పేజీ 265నుండి –267వ పేజీవరకు చూడు).
6. *ప్రభువైన యేసును గూర్చి యితరులకు తెలియజేయి* – నీకు వీలైన ప్రతి ఒక్కనికి ఉపదేశించు (మత్తయి 28:18–20; మార్కు 16:15, 16). ఈ పుస్తకాన్ని స్నేహితులతో పంచుకో, క్రైస్తవులయ్యేలా వారికి సహాయపడు.
7. *సత్ క్రియలు చేయి* – ప్రభువుచే రక్షింపబడినవారు సత్క్రియలు చేయు వారుగా సృజింపబడ్డారు (ఎఫెసీ. 2:10).